# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 154 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

19-04-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4


# స్వచ్ఛ ఆంధ్రా... లేక ఫోటో ఆంధ్రా?




- చీపురుతో ఫోజులు... ప్రమాణాల డ్రామా... డీఎం&హెచ్ఓ ఆఫీస్‌లో తూతూ మంత్రంగా స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం!
- ఫోటోలకు చీపురు... తర్వాత ప్రమాణం చేసి వెళ్లిపోయిన అధికారులు!
- శుభ్రత పేరుతో షో... అసలు పని లేకుండానే ముగిసిన కార్యక్రమం!
- కెమెరా ముందు ఊడ్చినట్లు నటన... తర్వాత ఖాళీ చేసిన సిబ్బంది!
- చీపురు ఊపింది ఫోటో కోసం... ప్రమాణం చేసింది పేరు కోసం!
- స్వచ్ఛ ఆంధ్ర పేరుతో నాటకం... విమర్శలు పాలైన అధికారులు
- ప్రమాణాలు ఘనంగా... పరిశుభ్రత మాత్రం ఎక్కడా కనిపించలేదు!

**నవతరం ప్రతినిధి - శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా డీఎండహెచ్ఓ కార్యాలయం ప్రాంగణంలో ఎక్కడ చూసినా దుమ్ము, చెత్త, అపరిశుభ్రత అలాగే కనిపిస్తున్నా, అధికారులు మాత్రం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" పేరుతో కేవలం తూతూ మంత్రం లా కార్యక్రమం నిర్వహించారని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

చుట్టూ మురికి వాతావరణం అలాగే ఉండగానే, కెమెరా ముందు చీపురు పట్టి ఫోజులు ఇవ్వడం, తర్వాత ప్రమాణము చేసి వెళ్లిపోవడం చూసిన వారు ఇది శుభ్రత కార్యక్రమమా లేక ఫోటో కార్యక్రమమా అని ప్రశ్నిస్తున్నారు.

కార్యక్రమం ప్రారంభమైన వెంటనే అధికారులు, సిబ్బంది ఒక గదిలో ఉన్న చీపురును తీసుకుని అటు ఇటు రెండు నాలుగు సార్లు ఊడ్చినట్లుగా నటించారు. ఎక్కడా చెత్త తొలగింపు లేదు... ఎక్కడా శుభ్రత చర్యలు లేవు... కానీ కెమెరాలు క్లిక్‌మనగానే చీపురు పట్టుకుని గొప్పగా పనిచేస్తున్నట్లుగా ఫోజులు ఇచ్చారు. ఫోటోలు పూర్తయ్యాక వెంటనే చీపురును పక్కన పెట్టేశారు.

అంతటితో ఆగకుండా, తర్వాత బ్యానర్ ముందు నిలబడి చేతులు చాపి ప్రమాణ స్వీకారం చేశారు. "స్వచ్ఛ ఆంధ్ర" అంటూ గొప్ప మాటలు చెప్పినా, ఆ ప్రమాణాలకు తగ్గ పని మాత్రం కనిపించలేదని అక్కడున్న వారు అంటున్నారు. ప్రమాణం ముగిసిన వెంటనే అందరూ ఒక్కొక్కరుగా వెళ్లిపోవడంతో కార్యక్రమం అసలు ఉద్దేశం ఏమిటో ప్రజలకు అర్థం కాలేదని విమర్శిస్తున్నారు.



కార్యాలయం పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, నిర్లక్ష్యంగా ఉన్న ప్రాంగణం, పరిశుభ్రత లేని గదులు అలాగే ఉండగా, ఫోటోలకు మాత్రమే చీపురు పట్టడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన డీఎండహెచ్ఓ కార్యాలయంలోనే ఇలాంటి తూతూ మంత్రపు కార్యక్రమాలు జరగడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలను కొందరు అధికారులు కేవలం ఫోటోలు, హాజరు, ప్రచార ప్రకటనలకే పరిమితం చేస్తే అసలు ప్రయోజనం ఎలా చేరుతుందని ప్రజలు మండిపడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, ఇలాంటి నకిలీ కార్యక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

చీపురు ఊపింది కెమెరా కోసం... ప్రమాణం చేసింది పేరు కోసం... పని మాత్రం శూన్యం!



## పాలకొండకు రూ.72 కోట్ల తాగునీటి పథకం ప్రారంభం

- ఇన్ఫిల్ట్రేషన్ వెల్ పనులకు ఎమ్మెల్యే జయకృష్ణ శ్రీకారం
- ప్రతి ఇంటికి శుద్ధ తాగునీరు లక్ష్యమన్న ఎమ్మెల్యే
- నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు
- పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశం



**నవతరం -పాలకొండ**

పాలకొండ మండలం మంగలాపురం బ్రిడ్జి సమీపంలోని సంకిలి బ్రిడ్జి వద్ద రూ.72 కోట్ల వ్యయంతో మంజూరైన నాన్ అమృత్ వాటర్ స్కీమ్ పరిధిలో ఇన్ఫిల్ట్రేషన్ వెల్ నిర్మాణ పనులను పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రారంభించారు. -మిగతా 2లో

## జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.40 వేల సాయం

- లోలుగులో మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నేతలు
- జిల్లా అధ్యక్షుడు పీసిని చంద్రమోహన్ చేత ఆర్థిక సహాయం
- అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా
- స్థానిక జనసైనికుల సహకారంతో సాయం అందజేత



**నవతరం -ఆమదాలవలస**

ఆముదాలవలస నియోజకవర్గం పొందూరు మండలం లోలుగుకు చెందిన జనసేన కార్యకర్త లొట్టి వెంకటస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో -మిగతా 2లో

## పెండింగ్ కేసులు వేగంగా పూర్తి చేయాలి

- నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఆదేశాలు
- డైనమిక్ బీట్ సిస్టమ్ సమర్థంగా అమలు చేయాలని సూచన
- గంజాయి కేసుల నిందితులను వెంటనే ట్రేస్ చేయాలి
- నిర్లక్ష్యం, అవినీతి సహించబోమన్న ఎస్పీ



**నవతరం -శ్రీకాకుళం,**

జిల్లాలో పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నేర నియంత్రణ చర్యలను బలోపేతం చేయాలని -మిగతా 2లో

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

- ప్రభుత్వ విప్ బెందాళం అశోక్
- ఇచ్ఛాపురంలో కలెక్టర్‌తో కలిసి వినతుల స్వీకరణ..



**నవతరం -ఇచ్ఛాపురం**

నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ బాబు పేర్కొన్నారు. శనివారం ఇచ్ఛాపురం మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ.. -మిగతా 2లో

ఎడిటోరియల్

# మహిళా బిల్లుపై కపట ప్రేమ

చట్టసభల్లో మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యం సామాజిక న్యాయం, సమానత్వం అనే రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉంది. ప్రజాస్వామ్య సౌధానికి సగభాగమైన మహిళలకు రాజకీయంగా చట్టసభల్లో సముచిత స్థానం దక్కాలన్న దానికి ప్రధాన రాజకీయ పార్టీలు వ్యతిరేకం కాదు. రిజర్వేషన్లు అమలు చేయాలని ఎప్పట్నుంచో కోరుతూ వస్తున్నాయి. దాని ప్రకారం మహిళా రిజర్వేషన్ బిల్లు 2023లో పార్లమెంటు ఆమోదం పొందింది. రాజ్యాంగంలో భాగమైంది. కానీ, ఎప్పటినుంచి అమలులోకి తెస్తామని మాత్రం చెప్పకుండా దాటవేసింది మోడీ ప్రభుత్వం. ఇప్పుడు హడావిడిగా కసరత్తు చేపట్టింది. లోక్‌సభ స్థానాల పెంపుదలకు ఉద్దేశించిన మూడు బిల్లులతో మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కూడా ఈనెల 16 నుంచి మూడు రోజులపాటు జరగబోయే పార్ల మెంటు ప్రత్యేక సమావేశాల్లో చర్చించి చట్టం రూపంలోకి తేబోతు న్నట్టు ప్రకటించింది. 2029లోనే అమలు చేస్తామని అంటోంది. వాస్తవానికి మహిళా రిజర్వేషన్ బిల్లుకూ, నియోజకవర్గాల పునర్వి భజన బిల్లులకూ సంబంధం లేదు. పార్టీలను సమావేశ పరచకుండా బిల్లులను లోతుగా అధ్యయనం చేసే అవకాశం సభ్యులకు ఇవ్వ కుండా హడావిడిగా సమావేశాలు నిర్వహిం చడం వెనుక బీజేపీ కపటనీతి ఏంటో అర్థమవుతుంది. దీనికి ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలే ప్రధాన కారణం. దీన్ని చూపి ఆ వర్గాల ఓటర్లలో సానుభూతి పొందడం తప్ప మరోటి కాదు. గతంలో ఎన్నికలు జరిగిన ప్రతీ సందర్భంలోనూ కులం, మతం, యుద్ధం ఏదో ఒక విభజనను ముందుకు తెచ్చి దాని ద్వారా బీజేపీ లబ్ధిపొందింది. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలుచేసే విషయంలో కేంద్రం అనుసరిస్తున్న ధోరణి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉంది.

ఉభయ సభల సభ్యులు ఎన్నికల్లో తలమునకలైవున్న సందర్భంలోనే ఈ ప్రత్యేక సమావేశం జరపాలనడం మోడీ ప్రభుత్వానికి చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి ఉంటుందని అనుకోలేం. నిజంగానే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 ఎన్నికల్లోనే అమలు చేయాలని నరేంద్ర మోడీ సర్కారు అభిమతమైతే ఆ బిల్లు ఆమోదించిన 2023 సెప్టెంబర్‌లోనే ఆ పనిచేసేవారు. తాజా జనాభా లెక్కల ప్రాతిపదికపై డీలిమిటేషన్ జరిపాకనే కొత్త చట్టం అమలు చేస్తామని గతంలో ఈ పాలకులే స్పషం చేశారు.

జనగణన, డీలిమిటేషన్ గురించి అంతగట్టిగా చెప్పినవారు ఇప్పటివరకు ఆ పని పూర్తి చేయనేలేదు. దాదాపు మూడేండ్ల వుతున్నా డీలిమిటేషన్ కమిషన్‌ను నియమించ లేదు. జనగణన పూర్తిస్థాయిలో ప్రారంభమే కాలేదు. అవేమీ చేయకుండా ఇప్పుడు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు పెట్టి బిల్లులు ఆమోదింప చేసుకుని.. జనగణన, డీలిమిటేషన్ పూర్తయ్యాకే అంటున్నా రంటే మహిళల పట్ల చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవు తోంది.

జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఎన్‌డీఏ పక్షాలు రాజకీయ లబ్ధిపొందడం కోసమే ఇదంతా చేస్తున్నారన్నది స్పష్టం.

ఇంత కీలకమైన చట్టాన్ని అమలు చేయడంలో అన్ని రాజకీయ పార్టీలను, రాష్ట్ర ప్రభుత్వాలను భాగస్వాములను చేయడం అత్యవసరం. కానీ అఖిలపక్ష సమావేశం నిర్వహించకపోవడం, ప్రతిపక్షాల అభ్యంతరా లను పరిగణనలోకి తీసుకోకపోవడం వంటి అంశాలు ప్రభుత్వం ఏకపక్ష ధోరణిని సూచిస్తున్నాయి. నిజంగా మహిళల సాధికారత పట్ల కట్టుబడి ఉంటే, 2023లోనే చట్టం ఆమోదం పొందిన వెంటనే అమలు దిశగా చర్యలు తీసుకోవాల్సింది.

ప్రభుత్వం ముందుగా పేర్కొన్నట్టు మహిళా రిజర్వేషన్ అమలును జనగణన, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)తో ముడిపెట్టడం మరో వివాదాస్పద అంశం. ఈ రెండు ప్రక్రియలు పూర్తి కాకుండా రిజర్వేషన్లు అమలు చేయలేమని చెప్పడం ఒకవైపు; మరోవైపు ఆ ప్రక్రియలను వేగవంతం చేయడంలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం మరోవైపు. ఇప్పటికీ జనగణన పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. డీలిమిటేషన్ కమిషన్ నియామకం కూడా ఆలస్యమవుతోంది. దీంతో ప్రభుత్వం చెప్పే కారణాలపై నమ్మకం లేదు.

మహిళా రిజర్వేషన్ ప్రక్రియకు జనగణన, నియోజక వర్గాల పునర్విభజన అంశాలతో ముడిపెట్టకుండానే అమలు చేయాలి. ఎందుకంటే నియోజకవర్గాల పెంపు విషయంలో వివిధ రాష్ట్రాలకు అభ్యంతరాలుండడం సహజం. అంతేగాక జనాభా వృద్ధిరేటు విషయంలోనూ రాష్ట్రాల మధ్య చాలా తేడాలున్నాయి. ఇటువంటి అనేక చిక్కులు తలెత్తుతాయి. రాష్ట్ర అసెంబ్లీల నియోజకవర్గాల విభజన, సంఖ్యను పెంచడం వంటి ప్రతిపాదనలున్నందున రాష్ట్ర ప్రభుత్వాలతోనూ సంప్రదింపులు జరపాలి. విస్తృత చర్చల అనంతరం ఏకాభిప్రాయం ద్వారా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా విశాల సమాజ హితం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి. మహిళా రిజర్వేషన్‌ను అనవసరమైన షరతులతో ముడిపెట్టకుండా అమలు చేసే మార్గాలను పరిశీలించాలి.అందుకు ప్రజాఒత్తిడి అవసరం.

# బల - అతిబల రహస్యం




సాయంత్రం సమయం...
ఇంటిముందు మట్టి మెట్లు... చల్లని గాలి వీస్తోంది...
అమ్మ చుట్టూ పిల్లలు కూర్చున్నారు. చేతిలో దీపం వెలుగుతోంది.

"అమ్మా... ఒక మంచి కథ చెప్పవా?" అని చిన్న చిన్ని అడిగింది.

అమ్మ చిరునవ్వు నవ్వింది...
"ఈ రోజు మీకు ఒక గొప్ప రహస్య కథ చెబుతాను... బల -- అతిబల మంత్రాల కథ..."

"ఒకప్పుడు, అయోధ్యలో..." అంటూ
అమ్మ నెమ్మదిగా ప్రారంభించింది...

"ఒక రోజు విశ్వామిత్ర మహర్షి, శ్రీ రాముదుని అరణ్యానికి తీసుకెళ్తున్నాడు..."

పిల్లలు ఆసక్తిగా వినసాగారు.

"సాయంత్రం అయ్యింది... పక్షులు గూళ్లకు చేరాయి...
ఆ సమయాన, విశ్వామిత్రుడు రాముని పిలిచాడు..."

"రామా..." అని విశ్వామిత్రుడు అన్నాడు...
"నేను నీకు ఒక గొప్ప రహస్యం చెబుతున్నాను...
ఇవి సాధారణ మంత్రాలు కావు..."

"ఓం బలాయై నమః...
ఓం అతిబలాయై నమః...
ఓం బలాతిబలాయై నమః..."

పిల్లల కళ్ళు పెద్దవయ్యాయి.

అమ్మ మెల్లగా చెప్పింది...
"ఈ మంత్రాలు నేర్చుకున్నవారికి..."

ఆకలి ఉండదు
దప్పిక ఉండదు
అలసట ఉండదు
చెడు శక్తులు దగ్గరికి రావు
మనసు ప్రకాశిస్తుంది
బుద్ధి పెరుగుతుంది

చిన్న పిల్లాడు అడిగాడు:
"అమ్మా... మనం కూడా ఇవి జపిస్తే సూపర్ పవర్స్ వస్తాయా?"

అమ్మ నవ్వింది...
"సూపర్ పవర్స్ కాదు బంగారం...
కానీ ఇవి మనసుకు బలం ఇస్తాయి..."

"అసలు 'బల' అంటే శరీర బలం మాత్రమే కాదు...
మనసు ధైర్యం, ఆలోచన శక్తి, మంచితనం కూడా..."

అమ్మ చివరగా చెప్పింది...
"మీరు ప్రతి రోజు మంచి ఆలోచనలు చేస్తే...
దేవుని పేరు జపిస్తే...
అదే నిజమైన బల -- అతిబల..."

పిల్లలు అందరూ కలిసి చెప్పారు...
"ఓం బలాయై నమః..."

ఆ ఇంట్లో... ఆ రాత్రి...
శాంతి, ఆనందం నిండిపోయాయి...

నీతి:
నిజమైన శక్తి మనలోనే ఉంది -- మంచి ఆలోచనలు, ధైర్యం, భక్తి.

రాసినోడు : తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా
బాబు జగ్జీవన్ రామ్ నగర్
హైదరాబాద్ -500037
చరవణి : 9297109223

## ముఖ్యమంత్రితో భేటీ అయిన బద్వేలు తెలుగుదేశం నాయకులు

# చెరుకూరి రవికుమార్ నాయుడు దంపతులు

**బద్వేలు నవతరం**

బద్వేలు యువ నాయకులు చెరుకూరి రవి కుమార్ నాయుడు కుటుంబ సమేతంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఈ నెల 20వ తేదీన జరగనున్న ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. పలు సేవా కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి గారికి వివరించారు.

ఈ సందర్భంగా అమరావతికి చట్టబద్ధత కల్పించి రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేసినందుకు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, పరిపాలనలో దూరదృష్టితో తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశంసించారు.

అనంతరం బద్వేలు నియోజకవర్గ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సవివరంగా చర్చించి, ప్రజల ఆశలు-ఆకాంక్షలను వివరించారు. బద్వేలు సమగ్ర అభివృద్ధి కోసం త్వరితగతిన సరైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రిని వినయపూర్వకంగా అభ్యర్థించారు.

ఇదే సందర్భంలో బద్వేలు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ముఖ్య అంశాలను పొందుపరిచిన వినతి పత్రాన్ని సమర్పించి, రాబోయే రోజుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ మద్దతు అందించాలని కోరారు.

ప్రజల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి పట్ల తమ కట్టుబాటును వ్యక్తం చేస్తూ, బద్వేలు ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని రవికుమార్ ముఖ్యమంత్రిని కోరారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**మొదటిపేజీ తరువాయి**

మున్సిపాలిటీ పరిధిలోని 34 ఎకరాల కొరారి బంద (కోదండరామ చెరువు)లో సుమారు 10 ఎకరాలకు పైగా స్థలం ఆక్రమణకు గురవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే దీనిపై విచారణ జరిపి ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే మున్సిపాలిటీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా 1, 2, 3 వార్డుల ప్రజలకు పైపులైన్ల ద్వారా తాగునీరు అందకపోవడం దురదృష్టకరమని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. బాహుదా నదిపై కొత్త వంతెన నిర్మాణం, 100 పడకల ఆసుపత్రి, రైతు బజార్ ఏర్పాటు, పాలిటెక్నిక్ కళాశాల వంటి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయిస్తామని వివరించారు.

ఈ గ్రీవెన్స్‌లో అందిన మొత్తం 63 వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి, కమిషనర్ ఎన్. రమేష్, సుడా డీఈ సుధాకర్, తహశీల్దార్ ఎన్. వెంకటరావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు వేగంగా పూర్తి చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ పోలీసు అధికారులకు ఆదేశించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్లు తక్షణమే అమలు చేయాలని, గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను గుర్తించి కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. రాత్రివేళల్లో డైనమిక్ బీట్ సిస్టమ్‌ను సమర్థవంతంగా అమలు చేసి నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీ పెంచాలని సూచించారు. మిస్సింగ్ కేసుల ఛేదనలో సీసీటీవీ కెమెరాలు, డేటా అనలిసిస్ వంటి సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ డ్రైవ్, డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం లేదా అవినీతిని సహించబోమని స్పష్టం చేశారు.

## జనసేన కార్యకర్త కుటుంబానికి రూ.40 వేల సాయం

**మొదటిపేజీ తరువాయి**

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు పీసిని చంద్రమోహన్, నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్ రావు మంగళవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

స్థానిక జనసైనికుల సహకారంతో మృతుడి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో అన్ని విధాలా ఆ కుటుంబానికి జనసేన పార్టీ శ్రేణులు అండగా నిలుస్తాయని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొంచాడ చిన్నంనాయుడు, పొన్నాడ బాలకృష్ణ, కొంచాడ సూర్య, లోలుగు సురేష్, కోరాడ రాజు, గార బాబురావు, లొట్ల మనోజ్, బెల్లాన శివప్రసాద్, ఆబోతుల దినేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## పాలకొండకు రూ.72 కోట్ల తాగునీటి పథకం ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకొండ పట్టణ ప్రజల తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న నీటి కొరత సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత పాలకొండ నగర పంచాయతీ పరిధిలో ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించగలమన్నారు. ప్రజల ఆరోగ్యానికి శుభ్రమైన నీరు అత్యంత అవసరమని, ఈ పథకం ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. పనులు నాణ్యతతో, నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

**నవతరం -శ్రీకాకుళం**

"శిక్షణ పొందిన విద్యార్థులు తమకున్న నైపుణ్యంతో సొంతంగా కుటీర, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించి నూతన పారిశ్రామికవేత్తలుగా అభివృద్ధి బాటలో నడవాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు ఆకాంక్షించారు. కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎం ఎస్ ఎం ఈ, ప్రపంచ బ్యాంకు సహకారంతో 20 రోజుల పాటు నిర్వహించిన ఎంటర్ప్రెన్యువర్షిప్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి యు. సాయికుమార్ మాట్లాడుతూ.. నూతన వ్యాపారాలు ప్రారంభించే వారికి ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలను అందిస్తుందని, విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఇతరులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఐటి ప్రాజెక్ట్ ఇంచార్జ్ జి. అరుణ్ కుమార్ విద్యార్థులకు కాటన్ బ్యాగులను పంపిణీ చేసి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్ ఎల్. కృష్ణారావు మాట్లాడుతూ.. రామోజీరావు, గ్రంధి మల్లికార్జున రావు వంటి ప్రముఖుల స్ఫూర్తితో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కోనసీమ జిల్లా.. గుమ్మిలేరులో....
# పార్శ్వనాథ జైన ఆలయం



శ్రీ శంకేశ్వర పార్శ్వనాథ జైన ఆలయం ఆంధ్రప్రదేశ్లోని ప్రసిద్ధ జైన పుణ్యక్షేత్రాలలో ఒకటి. ఈ జైన ఆలయం,తూర్పు గోదావరి ప్రస్తుత కోనసీమ జిల్లాలో ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు గ్రామంలో ఉంది. స్థానికంగా ఈ ఆలయాన్ని 'గుమ్మిలేరు జైన ఆలయం' అని కూడా పిలుస్తారురు. పూర్తిగా పాలరాతితో నిర్మించబడిన ఈ జైన ఆలయంలో మూలనాయకుడుగా (మూల విరాట్టు) 23 వ జైన తీర్థంకరుడైన పార్శ్వనాథుడు నెలకొని ఉన్నాడు.శ్రీ శంకేశ్వర పార్శ్వనాథ జైన ఆలయం అత్యంత ప్రసిద్ధమైనది. 1977లో జాతీయ రహదరి పనుల సమయంలో బయటపడిన 2000 ఏళ్ల నాటి చారిత్రక విగ్రహాలతో ఈ ఆలయం నిర్మితమైంది. ఈ ఆలయ నిర్మాణం: ఇనుము ఉపయోగించకుండా రాజస్థానీ శైలిలో, పూర్తిగా పాలరాతితో ఈ ఆలయాన్ని నిర్మించారు. మండపేట-ఆలమూరు కలిపే రహదారి వెంబడి, గుమ్ములూరు గ్రామంలో చుట్టూ పచ్చని పొలాల మధ్యన ఈ ఆలయాన్ని నిర్మించారు. జైన తీర్థంకరుడైన పార్శ్వనాథుడి గౌరవార్థం నిర్మించబడిన ఈ ఆలయానికి నిర్మాణపరంగా ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఆలయ నిర్మాణం కోసం రాజస్థాన్ నుంచి తెప్పించిన ఖరీదైన తెల్ల పాలరాతిని వాడారు. ఇనుము తదితర లోహాలను ఉపయోగించలేదు. 2006 లో జైన ఆచార్యుడు శ్రీ జయంతసేన సూరేశ్వర్ జీ మహరాజ్, ఈ పాలరాతి ఆలయంలో అర్ధ పద్మాసన రీతిలో వున్న పురాతన పార్శ్వనాథ విగ్రహాన్ని మూల నాయకునిగా ప్రతిష్ఠించడం జరిగింది. సదూర ప్రాంతాల నుంచి వచ్చే జైన భక్తుల సౌకర్యార్థం ఈ ఆలయం చుట్టూ వున్న ఆవరణలో వసతి గృహాలను నిర్మించారు. జైనులకు పుణ్యక్షేత్రంగా వున్న ఈ ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల నుండి జైనులు తరలి వస్తుంటారు.

**ఆలయ నిర్మాణం :**

1977 లో ఆలమూరు మండలంలోని గుమ్మిలేరు గ్రామంలో కాలువ కోసం త్రవ్వకాలు జరుపుతున్నప్పుడు అక్కడ పురాతన జైన విగ్రహం బయల్పడింది. గ్రామస్థులు తొలుత దానిని బుద్ధుని విగ్రహంగా భావించి పూజించడం మొదలుపెట్టారు. అయితే నిపుణుల పరిశీలనలో ఆ పురాతన విగ్రహం 23వ జైన తీర్థంకరుడైన పార్శ్వనాథుడి విగ్రహంగా తేలింది. విగ్రహకాలం సుమారుగా 2000 సంవత్సరాలకు పూర్వం ఉండవచ్చని గుర్తించారు.మౌర్యుల కాలం నాటిదిగా భావించబడిన ఈ తీర్థంకరుని విగ్రహం అర్ధ పద్మాసన ముద్రలో ఆశీనుడిగా కనిపిస్తున్నది. ఈ పురాతన విగ్రహాన్ని రాజమండ్రికి తరలించడానికి చేసిన ప్రయత్నాలను, స్థానిక ప్రజలు గట్టిగా ప్రతిఘటించడంతో జైన సంఘం ఈ విగ్రహాన్ని గుమ్మిలేరులోనే వుంచి, అది బయల్పడిన ప్రదేశంలోనే ఒక సుందరమైన ఆలయాన్ని నిర్మించాలని నిశ్చయించింది.

జైన తీర్థంకరుడైన పార్శ్వనాథుడి గౌరవార్థం నిర్మించబడిన ఈ ఆలయానికి నిర్మాణపరంగా ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఆలయ నిర్మాణం కోసం రాజస్థాన్ నుంచి తెప్పించిన ఖరీదైన తెల్ల పాలరాతిని వాడారు. ఇనుము తదితర లోహాలను ఉపయోగించలేదు. 2006 లో జైన ఆచార్యుడు శ్రీ జయంతసేన సూరేశ్వర్ జీ మహరాజ్, ఈ పాలరాతి ఆలయంలో అర్ధ పద్మాసన రీతిలో వున్న పురాతన పార్శ్వనాథ విగ్రహాన్ని మూల నాయకునిగా ప్రతిష్ఠించడం జరిగింది. సదూర ప్రాంతాల నుంచి వచ్చే జైన భక్తుల సౌకర్యార్థం ఈ ఆలయం చుట్టూ వున్న ఆవరణలో వసతి గృహాలను నిర్మించారు. జైనులకు పుణ్యక్షేత్రంగా వున్న ఈ ఆలయశీ ప్రసిద్ధి చెందింది.
ప్రసిద్ధి చెందిన శ్రీ పార్శ్వనాథ దిగంబర జైన తీర్థం ఆలయానికి చేరుకోవడానికి మార్గాలు:రాజమండ్రి నుండి సుమారు 35 -40 కిలోమీటర్లు, కాకినాడ నుండి సుమారు 60- 70 కిలోమీటర్ల దూరంలో గుమ్మిలేరు ఉంది. రాజమండ్రి లేదా రావులపాలెం నుండి బస్సులు టాక్సీల ద్వారా సులభంగా మందిరాన్ని చేరుకోవచ్చు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# ఓ మహిళా మేలుకో..!

ఓ మహిళా...తెలుసుకో..!
అసమానత ఒక అగ్ని కణమని ఈ
సమాజం మానవత్వంలేని ముళ్ల వనమని

"అర్ధనారీశ్వరం" అంటారు
"అరగంట కూడా నీతో
"సమానంగా నడవరు...
"స్త్రీని దేవతని "పూజిస్తారు
"దైనందినంలో దెయ్యంలా ద్వేషిస్తారు

స్త్రీని ఆకాశపు
అప్సరని కీర్తిస్తారు...కానీ కంటి
చూపుల కత్తులతో కాలుస్తారు ...
స్త్రీని జననీ, జగజ్జనని అంటారు...
జీవితాంతం వెట్టిచాకిరి చేయిస్తారు...

అమ్మ అనే అక్షరం
ఒక అమృతబిందువు...
కానీ ఆస్తుల లెక్కల్లో ఆ
అక్షరం...అనాథ శబ్దమవుతుంది...

అంతరిక్షాన్ని
తాకే ఆమె అడుగులు
ఇంకా అనుబంధాల
అంచులకే వేలాడుతున్నాయి ...
ఆమె ఆదిపరాశక్తి  కాదంటారా..?
ఆమె శివుని శ్వాసలో సగం
కాదంటారా..?

నోముల వ్రతాల వలలో
నిద్ర మాత్రలిచ్చే నీతి కథలు
మహిళలను మెలకువలోనే
మాయలో ముంచే
గాయత్రీమంత్రాలు...

స్త్రీ కి స్వేచ్ఛ ఎక్కడ  ..?
స్వాతంత్ర్యం ఏది..?
ఎంత వెదికినా సమాజంలో
సమానత్వం కనిపించదే...

పార్లమెంటు గోడల మధ్య
ప్రతిజ్ఞలు ప్రతిధ్వనిస్తాయి
కానీ హక్కుల పాదాలు
ఇంకా అక్కడ అడుగుపెట్టలేదు ...

వేయిదీపాలు వెలిగించినా
ఈ చీకటి కరిగేది కాదు
సమిష్టి స్ఫూర్తి శక్తి ఒక
సూర్యబింబమై వెలిగితే తప్ప...

అందుకే---
ఓ మహిళా...మేలుకో
నీ మౌనం వీడు
ఉప్పెనలా విరుచుకుపడు...
నీ గళం విప్పి పులిలా గర్జించు
సమాన హక్కుల
సూర్యోదయం వచ్చేవరకు
సమిష్టి సమరమే నీకు శరణ్యం...

ఓ మహిళా... మేలుకో.
నీ భవిష్యత్తుకు నీవే దీపస్తంభమవ్వు...
ఓ మహిళా...మేలుకో నీ శక్తి తెలుసుకో...
ఇకనైనా ఈ కంప్యూటర్ యుగంలోనైనా...



కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# టీవీ సినిమా

**మూవీ రివ్యూ: తిమ్మరాజుపల్లి టీవీ**
**రేటింగ్: 2.5/5**
**తారాగణం: సాయితేజ్, వేదా జలంధర్, ప్రదీప్ కొట్టే, స్వాతి, అమ్మ రమేష్,సత్యనారయణ, లతీష్ తదితరులు**
**కెమెరా: అక్షయ్ రాం**
**ఎడిటింగ్: మునిరాజ్**
**సంగీతం: వంశీకాంత్ రేఖన**
**నిర్మాత: కిరణ్ అబ్బవరం**
**దర్శకత్వం: మునిరాజ్**
**విడుదల: 17 ఏప్రిల్ 2026**

కొత్త నటీనటులతో ఇలాంటి చిత్రాలు వస్తూనే ఉంటాయి. సాధారణంగా వచ్చాయన్న సంగతి కూడా తెలియకుండా వెళ్లిపోతుంటాయి. కానీ ఈ చిత్రంపై దృష్టి పడడానికి కారణం నటుడు కిరణ్ అబ్బవరం నిర్మాతగా రావడం. ట్రైలర్ ని బట్టి ఇదొక గ్రామీణ నేపథ్యం కథ అని తెలుస్తూనే ఉంది. ఇంతకీ ఎలా ఉందో చూద్దాం.
1996లో తిమ్మరాజుపల్లి అనే చిత్తూరు జిల్లాలోని పల్లెటూరు. ఆ ఊరి జనానికి దగ్గర్లో ఉన్న పెద్ద ఊరు ఏది అంటే కుప్పం. అలాంటి ఊరులో టీవీని, వీసీయార్ ని కుప్పం నుంచి రెంట్ కి తెచ్చి శివరాత్రి లాంటి పండగలకి జనం కోసం కమీషన్ తీసుకుని సినిమాలు వేస్తుంటాడు సతీష్ (సాయి తేజ్).
అదే ఊళ్లో రాజప్ప అనే మరొక యువకుడు, అతనికి ఒక చెల్లెలు శారద (వేదా జలంధర్). సతీష్, శారదలు ఒకర్ని ఒకరు ఇష్టపడుతుంటారు.
ఇదిలా ఉంటే ఆ ఊళ్లో ప్రెసిడెంట్ కి ఏం చేసినా తానే ముందు చెయ్యాలని అనుకునే తత్వం. ఆ ఊరిలో మొదటి పెంకుటిల్లు కట్టింది తానేనని, మొదటగా మరేదో చేసింది తానేనని గుర్తు చేసుకుని మురిసిపోతుంటాడు. అలా ఆ ఊరి ప్రజల కోరిక మేరకు ఎప్పటికైనా టీవీని కూడా తానే కొనాలనుకుంటాడు.
కానీ రాజప్పకి పెళ్ళవడంతో కట్నం డబ్బుతో టీవీ కొంటాడు. అలా ఆ ఊరికి మొదటి సారి టీవీ వస్తుంది. ఊరి జనం అంతా సాయంత్రం నుంచి రాత్రి వరకు రాజప్ప ఇంట్లో టీవీకి అతుక్కుపోయి సీరియల్స్, సినిమాలు చూస్తుంటారు. అయితే ఒక రాత్రి ఎవరో ఆ టీవీని దొంగిలిస్తారు. ఎవరా దొంగ, ఏమిటా కథ..అనేది మిగతా కథ.
కథగా చెప్పుకుంటే ఇంతకంటే ఏమీ లేదు. ఈ అతి పలుచనైన కథని నిజానికీ అద్యంతం హాస్యంతో నింపేసి తీయొచ్చు. లేదా మళయాళం ఓటీటీ సినిమాల మాదిరిగా సటిల్ ట్రీట్మెంట్ తో నడపొచ్చు. కానీ ఆ రెండూ కాకుండా నేపథ్యానికి, యాసకి, పర్ఫార్మెన్స్ కి ప్రాధాన్యం ఇస్తూ సీరియస్ గా నడిపారు. ఆ పద్ధతి ఎంచుకున్న కాన్ ఫ్లిక్ట్ పాయింట్ కి నప్పలేదు. టీవీ పోవడమనే సాధారణమైన విషయానికి అంత సీరియస్ నెరేటివ్ నేచరల్ గా అనిపించదు.
సరే, ఆ విమర్శ అలా ఉంచితే మెచ్చుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. ముందుగా నటీనటుల పని తీరు.
హీరోగా కనిపించిన సాయితేజ్ పాత్రకు న్యాయం చేసాడు.
హీరోయిన్ వేదా జలంధర్ మాత్రం అలనాటి ఆమనిని, సంఘవిని కలిపి కొట్టిన అందం కొట్టొచ్చినట్టు కనిపించింది ఈమె ముఖంలో. రూరల్ తెలుగుతనంతో ఆకట్టుకునేలా ఉంది.
రాజప్ప పాత్రధారి ప్రదీప్ కొట్టే కూడా ఆద్యంతం తనదైన నేచురల్ పెర్ఫార్మెన్స్ ని ప్రదర్శించాడు.
మిగిలిన నటీనటులంతా వాళ్ల వాళ్ల పరిధుల మేరకు నటించారు.
ఇంతకీ చెప్పుకోవాల్సిన విషయం వంశీకాంత్ సంగీతం. ఈ సినిమాకి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో బ్యాక్ బోన్ గా నిలిచాడు. పాటల్లో ఒకటి బాగుంది.
కెమెరా వర్క్ కూడా ఇంటిలిజెంట్ గా, సీన్ యొక్క మూడ్ కి ఎలా ఉండాలో అలా ఉంది.
ఎడిటింగ్ ఇంకా షార్ప్ గా ఉండాల్సింది. రెండు గంటల సినిమాయే అయినా మూడు గంటల భారంలా అనిపించింది. దానికి కారణం, కేవలం ఎడిటింగ్ అనే చెప్పడానికి లేదు. స్క్రీన్ ప్లే లో ప్రాబ్లం ఉంది. సినిమా మొదలైన గంట వరకు కాన్ ఫ్లిక్ట్ పాయింట్ మొదలవ్వదు. ఇంటర్వెల్ కి తప్ప కథ మొదలైన ఫీలింగ్ రాదు. అంటే ప్రథామార్ధమంతా జంక్ ఎక్కువుంది.
హీరో హీరోయిన్స్ లవ్ ట్రాక్ కూడా పరమ వీక్ గా ఉంది.




ఫోకస్ టీవీ చోరీ మీద అనుకున్నా అదంతా సెకండాఫ్ కి నెట్టేయడం వల్ల ఫస్టాఫ్ లో ఏం చెప్పాలో తెలీక సాగదీసినట్టుగా అనిపించింది.
ఎలా చూసుకున్నా చిన్న బడ్జెట్ తో సింపుల్ గా ఇలాంటి చిత్రాలు తీయడం స్వాగతించదగ్గ విషయం. అయితే కథకి, కథనబలం కూడా ఉంటే ఇవే పాత్రలతో, ఈ పాత్రధారులతో అద్భుతాలు సృష్టించవచ్చు.
అత్యంత లో బడ్జెట్ లో తీసిన బలగం కావొచ్చు, లిటిల్ హార్ట్స్ కావొచ్చు..ఆయా జానర్స్ లో కమెర్షియల్ గా పెద్ద విజయాలయ్యాయి. నిర్మాతలకి నిజమైన లాభాలు తెచ్చిపెట్టాయి. ఈ తిమ్మరాజుపల్లి కూడా ఇంకా బిగుతైన కథాకథనాలు పండించి ఉంటే ఫలితం మరింత బాగుండేది. ప్రస్తుతానికి మాత్రం, టైటిల్లో టీవీ అని ఉన్నందుకు టీవీలో చూసే సినిమాలా ఉంది తప్ప హాలుకెళ్లి ఎంగేజ్ అయ్యే రేంజులో లేదు.

# శ్రీకాకుళంలో మెగా రక్తదాన శిబిరం




- ఎమ్మెల్యే గుండు శంకర్ చేత ప్రారంభం
- 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం
- ప్రాణదాతలైన యువతపై ప్రశంసలు
- సేవా కార్యక్రమాల్లో పద్మ పూజిత ముందంజ

**నవతరం-శ్రీకాకుళం**

విశాఖ ఏ కాలనీ, పెదపాడు రోడ్డులోని పద్మ పూజిత ఫైనాన్షియల్ అండ్ వీల్స్ మార్ట్ కార్యాలయంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గుండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలయ్యారని కొనియాడారు. కార్యాలయ హెడ్ బండార్ ఫణి కుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తమ సిబ్బంది ఎప్పుడూ ముందుంటారని చెప్పారు. ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ పి. జగన్ మోహన్ రావు మాట్లాడుతూ వేసవిలో రక్త నిల్వలు తగ్గే సమయంలో ఇలాంటి శిబిరాలు ఎంతో అవసరమన్నారు. తలసీమియా, సికిల్ సెల్ అనీమియా బాధితులకు రక్తదానం ప్రాణరక్షణగా నిలుస్తుందన్నారు.
కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు కె.




సత్యనారాయణ, పి. చైతన్య కుమార్, జి. రమణ, బి. చిన్మయరావు, సంస్థ ప్రతినిధులు ఏ. కృష్ణ, ఐతం వెంకటేష్, పురిటి రవికుమార్ పాల్గొన్నారు.

# టెక్కలిలో మెగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్

- డీఎస్పీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు
- 60 ఇళ్లు, 90 వాహనాలు, 200 మందిపై తనిఖీ
- పత్రాలు లేని ఆటో, 13 ద్విచక్ర వాహనాల గుర్తింపు
- మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పించిన పోలీసులు



**నవతరం-టెక్కలి**

రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా టెక్కలి కోదండరాం వీధిలో మెగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో డీఎస్పీ డి. లక్ష్మణరావు, సీఐ అంబటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.
ఈ ఆపరేషన్‌లో 60 ఇళ్లు, 90 వాహనాలు, 200 మంది వ్యక్తులను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ఒక ఆటోతో పాటు 13 ద్విచక్ర వాహనాలను గుర్తించారు.
ఈ సందర్భంగా పోలీసులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, చట్టపరమైన దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. అనుమానాస్పద సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తదుపరి పోలీసులు, ప్రజలు కలిసి ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ చేశారు.

# అమ్మవారి పండుగలకు సదుపాయాలు కల్పించాలి

- వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున కమిషనర్‌కు వినతి
- శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- పండుగ ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలి
- తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలి
- డివైడర్లు తొలగించి రాకపోకలు సాఫీ చేయాలి
- కమిషనర్‌ను కోరిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి



**నవతరం-శ్రీకాకుళం**

నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 24 నుంచి మే 15 వరకు అమ్మవారి పండుగలు నిర్వహిస్తున్న దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మౌళిక సదుపాయాలను కల్పించాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ వెంకట పద్మావతి కోరారు. ఈ మేరకు ఆమె మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ హనుమంతు కూర్మారావును కలసి శనివారం వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె కమిషనర్‌తో మాట్లాడుతూ అరసవిల్లి, మండల వీధి, మహలక్ష్మినగర్ కాలనీ, చిన్న మండల వీధి, కుమ్మరి వీధి, రుప్ప వీధి, దుడ్డి వీధి, గురిటిపోలమ్మ అమ్మవారి ప్రాంగణం స్టేట్ బ్యాంకు కాలనీ, గైనేటి వీధి, పెద్ద బరాటం వీధి, ప్రాంతంలో జరుగనున్న అమ్మవారి పండుగల సందర్భంగా మౌలిక వసతుల కల్పనకు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యం, ఆరోగ్య భద్రత దృష్ట్యా, కింది చర్యలను అత్యవసరంగా చేపట్టవలసిందిగా అవసరం ఉందని తెలిపారు. శానిటేషన్, స్వచ్ఛత, రోజువారీగా చెత్త తొలగింపు, డ్రైనేజ్ శుభ్రపరిచే పనులు, పబ్లిక్ హెల్త్ చర్యలు (డయేరియ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల పట్టణంలో నమోదైన అతిసార (డయేరియ ) వ్యాధి పునరావృతం కాకుండా శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఫుడ్ ఇన్స్పెక్షన్ కఠినంగా నిర్వహించాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, లైటింగ్ సదుపాయాలు కల్పించాలని కోరారు. అదే విధంగా పండుగ ప్రాంతాలలో ప్రధాన వీధుల్లో తగినంత స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, సెంటర్ డివైడర్స్ తాత్కాలికంగా తొలగించాలన్నారు. అరసవిల్లి నుండి పొట్టి శ్రీరాములు జంక్షన్ వరకు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్స్ తాత్కాలికంగా తొలగిస్తే ప్రజలు రాక పోకలు సాఫీగా సాగుతుందన్నారు. రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డివైడర్స్ తొలగించాలని ఈ సందర్భంగా కోరారు. వినతి



పత్రాన్ని పరిశీలించిన కమిషనర్ స్పందిస్తూ అమ్మవారి పండుగలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలవకుండా చూడాల్సిన బాధ్యత మాపై ఉందని ఈ సందర్భంగా పద్మావతికి వివరించారు.
కమిషనర్ ను కలిసిన వారిలో వైసిపి నాయకులు పొన్నాడ రుషి,
అలపాన త్రినాథ్ రెడ్డి, జయరాం, శోభన్, గుడికోటి బాల, నగరపు బాబురావు, రుప్ప లక్ష్మణ, తిరగడి లక్ష్మణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 23వ తేదీ నుంచి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



**బద్వేలు ఆర్డిఓ చంద్రమోహన్**

**బద్వేలు -నవతరం**

ఈనెల 23వ తేదీ నుంచి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ప్రారంభం అవుతాయని బద్వేలు ఆర్డిఓ చంద్రమోహన్ తెలిపారు మహోత్సవాలు ఈనెల 28 తేదీ వరకు జరుగుతాయని తెలిపారు ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం జరగకుండా దేవాదాయ శాఖ అన్ని చర్యలు చేపట్టినట్లు ఆర్డిఓ తెలిపారు అన్ని శాఖల అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డిఓ తెలిపారు.

# శ్రీకాకుళంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రకు శ్రీకారం

- దండివీధి దోబి ఘాట్ చెరువు వద్ద ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభం
- చెత్త తొలగించి పరిసరాల పరిశుభ్రతకు చర్యలు
- పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అన్న ఎమ్మెల్యే
- ప్రజల్లో అవగాహన పెంపే లక్ష్యమన్న అధికారులు

**నవతరం-శ్రీకాకుళం**

నగరంలోని 31వ డివిజన్ పరిధి దండి వీధి దోబి ఘాట్ చెరువు వద్ద శనివారం స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఘనంగా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. పరిశుభ్రత కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి కర్తవ్యమని స్పష్టం చేశారు. ప్రజలు తమ ఇళ్లతో పాటు వీధులు, కాలనీలు కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు.
దోబి ఘాట్ చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. మురుగు, చెత్త నిల్వలు తగ్గించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టారు.
31వ డివిజన్ ఇన్‌చార్జ్ విభూది సూరిబాబు మాట్లాడుతూ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు.
కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హనుమంతు కూర్మారావు, సహాయ కమిషనర్ శివకుమార్, హెల్త్ ఆఫీసర్ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**